వర్షాల వేళ.. విద్యుత్‌తో జరభద్రం

- అల్ప పీడన ప్రభావంతో అధిక వర్షాలు
- విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

వీరవాసరం: వర్షాల వేళ విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. దీనికి తోడు తుఫాను వలన కురిసే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలతో మరిన్ని ప్రమాదాలు సంభవిస్తాయి. వర్షాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు జారిపోతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఏ మాత్రం ఆదమరిచినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో రైతులు, ప్రజలు విద్యుత్ వినియోగంతో జాగ్రత్తలు పాటించాల్సిందే. బోర్ల కింద, కాలువల కింద మోటార్లతో సాగు చేసే రైతాంగం మరింత అప్రమత్తంగా ఉండాలి. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అనుమతి లేని వ్యక్తులు ఎటువంటి ఫ్యూజులు వేయరాదని, వీధి దీపాలు మార్చడం వంటివి చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందకు వాలిన నేపథ్యంలో సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యలో ఉంటాయి. వాటికి రక్షణ కంచెలు కూడా లేవు. పంట పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు మైనర్ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోకపోతే విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.


ప్రధాన విద్యుత్ స్టేషన్


గుబురుగా ఉన్న చెట్లను తాకుతూ వెళుతున్న తీగలు


గాలులకు విద్యుత్ తీగలపై పడుతున్న కొబ్బరి చెట్ల మట్టలు

చేయకూడని పనులు

వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకొద్దని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. నీటిలో పడిన విద్యుత్ తీగల జోలికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లొద్దని భవన నిర్మాణ కార్మికులు పనులు చేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలంటున్నారు. తడి చేతులతో, తడి బట్టలతో విద్యుత్ పరికరాలను ముట్టరాదని, మరమ్మతులు చేయొద్దని సూచిస్తున్నారు. పిల్లలు అందుకునే ఎత్తులో స్విచ్ బోర్డులను ఉంచరాదని, స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్ర విసర్జన చేయకూడదంటున్నారు. సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయడం, అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం, టీవీ, కేబుల్ వైర్లపై బట్టలు ఆరవేయడం వంటివి చేయరాదని హెచ్చరిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. మోటార్ పని చేయని సమయాల్లో చేతితో దానిని తాకరాదు. టెస్టర్‌ను ఉపయోగించి మాత్రమే పరీక్షించాలి. విద్యుత్ స్తంభం నుంచి మోటార్‌కు విద్యుత్ నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజు వేయాలి. మోటార్ వద్ద ఫ్యూజులు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను ఒక చెక్కపై బిగించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోని ఇనుప డబ్బాలపై బిగించకూడదు. విద్యుత్ సరఫరా లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. వర్షం కురుస్తున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి. వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే సొంతంగా మరమ్మతులు చేసుకోకూడదు. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

విద్యుత్ శాఖ సూచనలు పాటించాలి

భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగలు, తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను ప్రజలు నేరుగా తాకకూడదు. విద్యుత్ పరికరాల వద్ద వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ రబ్బరు చెప్పులు వాడాలి. వ్యక్తిగత భద్రతతో పాటు ప్రాణం మరింత ముఖ్యం. విద్యుత్ సమస్యలపై 1912కు లేదా 9440902926కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. తక్షణమే సమస్యలను పరిష్కరిస్తాం.

ఏపీ అప్పారావు, విద్యుత్ ఏఈ, వీరవాసరం

క్లుప్తంగా

వైద్య శిబిరం ఏర్పాటు


వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో పాటూరి మోహన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చర్మవ్యాధులు, డెంటల్, క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించగా నిర్వాహకుడు మోహన్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వైద్య సేవలు అందించడం మరింత సంతోషాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాయి రావులమ్మ, పాటూరి దొరబాబు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే గ్రంధి పరామర్శ


యాతం సాయిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: లోసరి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యాతం రామస్వామి (సాయి)ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్ గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు, ఆరోగ్య విషయాలను యాతం సాయిని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంట వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, తోకతిప్ప సర్పంచ్ తిరుమాని శ్రీను, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, కొప్పర్తి సత్యనారాయణ, పి.సత్యనారాయణ, పోసింశెట్టి నాగేశ్వరరావు, ఐ.వెంకట్రాజు, జె.గణేష్, బి.నాగరాజు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

చిత్రకళ పోటీల్లో విజేతలకు బహుమతులు


విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం: విద్యార్థులలో చిత్రకళా వ్యాప్తికి అంకాల ఆర్ట్ అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. అకాడమీ ఇటీవల నిర్వహించిన చిత్రకళ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులను అందించి ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అంకాల ఆర్ట్ అకాడమీ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఉచిత చిత్రకళ శిక్షణ వలన విద్యార్థులు ఎంతో ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. అకాడమీ కార్యదర్శి కాగిత వెంకట రమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, పార్థసారథి, వబిలిశెట్టి రామకృష్ణ, పాపోలు ఏడుకొండలు, తుమ్మిడి రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా లలితా పారాయణం


కోటి లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేస్తున్న సుహాసినీలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాయుత్రి లింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం కోటి లలిత సహస్ర స్తోత్ర నామ పారాయణం నిర్వహిస్తున్నట్లు అర్చక స్వామి ర్యాలి సతీష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. శ్రీ శివదేవస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కార్తీక మాసం ప్రారంభమైన ఈ నెల 1 నుంచి డిసెంబర్ 11వ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

తణుకు టౌన్: దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు దళితులంతా ఐక్యంగా పోరాడాలని నియోజకవర్గ దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ కోరారు. ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో కాకి రాముడు అధ్యక్షతన మండల మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్ల సురేష్ మాట్లాడుతూ మండపేట, తణుకు పట్టణాలలో జరిగిన హత్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాతి పునర్నిర్మాణంలో విద్యార్థులే కీలకం



మాట్లాడుతున్న అంజని శ్రీనివాసరావు

భీమవరం: జాతి పునర్నిర్మాణంలో విద్యార్థులే కీలకమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రముఖ్ జి.అంజని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భీమవరంలో ఆదివారం నిర్వహించిన విభాగ్ అభ్యాస వర్గ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తు నాయకులను తయారు చేయాల్సిన బాధ్యత ఏబీవీపీ పైనే ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొంతిన సాయి సుగ్రీవు, విభాగ్ కన్వీనర్ కాగిత దిన్ను చందు, భీమవరం మహిళా కన్వీనర్ జి.శిరీష పాల్గొన్నారు.

గోతులు పట్టించుకోండి బాబూ !

ఉండి: చంద్రబాబు ప్రభుత్వం గోతులు పూడుస్తున్నామని ప్రచారాలు, ఆర్భాటాలు ఊదరగొడుతున్నారు. దయచేసి ముందుగా ఎన్నార్పీ అగ్రహారంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహనదారులకు కనిపించని విధంగా ఉన్న పెద్ద పెద్ద గోతులను పూడ్చండి బాబూ.. అంటూ ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. చూసేందుకు గోతులు కంటికి పెద్దవిగా కనిపించకపోవడంతో వాహనదారులు వాటిని పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారు. తీరా ఆ గోతుల్లోకి ద్విచక్ర వాహనం, ఆటో, కార్ వంటివి వెళితే చాలు ప్రమాదం సంభవిస్తుంది. గత రెండు, మూడు రోజుల నుంచి ప్రమాదాలపై ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి వీటిలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా ప్రమాదాలకు లోనవుతున్నారు. గోతులు బూడిదగా మాదిరి ఉండడంతో దానిలోకి వెళ్లిన వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. గత కొద్దిరోజుల క్రితం రోడ్డు మరమ్మతుల పేరు చెప్పి నాణ్యతా ప్రమాణాలకు తీలోదకాలిచ్చి చేపట్టిన రోడ్డు రిపేరులో భాగంగానే పూడ్చారు అయితే అవి వెంటనే పాడవడంతో మరింత పెద్ద గోతులుగా మారిపోయాయి. గత రెండు రోజుల్లో ఓ కూరగాయల వ్యాపారి, ఓ చిరు వ్యాపారి, ఇద్దరు యువతులు, మరో వృద్ధ దంపతులు ఇలా ఎవరో ఒకరు ఈ గోతులకు బలయిపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు యువతులు గోతుల్లో పడిపోవడంతో గాయాలపాలయ్యారు. గోతులు పూడుస్తున్నాం అంటూ చెప్పుకోవడమే తప్ప చేసింది మాత్రం శూన్యం అంటూ వాహనదారులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.


జాతీయ రహదారిపై ఉన్న గోతుల్లో ప్రమాదానికి గురైన వాహనాలు

పెను ప్రమాదంలో దేవాలయ వ్యవస్థ

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వాలు హిందువుల మనోభావాలు, సమస్యలు అర్థం చేసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనాథ్ పేర్కొన్నారు. భీమవరంలోని ఆర్ఎస్ఎస్ అనుబంధ క్షేత్రాలతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆలయాల్లో భక్తులు సమర్పించే ముడుపులు అధికారులు పాలక మండలి ద్వారా దుర్వినియోగం అవుతున్నాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ఇతర దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ మంతెన రామచంద్రరాజు, చింతోజు ప్రసాదు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.శ్రీనాథ్

ఐక్యతకు ప్రతీక కార్తీక వన సమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసంలో నిర్వహించే కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సరిపిడకల రామారావు, వేంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జనపాటి మధుసూధన్‌రావు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు సమీపంలోని ఎస్టేట్ లో భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ ఫ్రెండ్స్ వారి కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెన్నాడ శ్రీను, అల్లం రమేష్ దంపతులు, కృష్ణారావు, చెరుకువాడ రంగసాయి, సయ్యపురాజు సూర్యనారాయణ రాజు, అల్లూరి బంగార్రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.


కార్తీక వన సమారాధనలో పాల్గొన్న కాలనీసభ్యులు

పర్యావరణానికి ముప్పు.. ప్లాస్టిక్ మహమ్మారి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ మహమ్మారి పర్యావరణ కాలుష్యంతో ప్రజారోగ్యాలు దెబ్బతింటాయని, ప్రతి ఒక్కరూ చేతి సంచులనే వాడాలని రైతు బజారు ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ కళ్యాణ్‌కుమార్ అన్నారు. భీమవరం రైతు బజార్‌లో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ లాంటి వ్యాధులు రావడానికి అవకాశాలున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారాలతో పాటు జరిమానాలు కూడా విధిస్తున్నారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో వైవీఎల్ మూర్తి, ఆర్.సత్యనారాయణ, రైతులు నాగరాజు, సత్యనారాయణ, రాముడు, ఆళ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామ దేవతల జాతరకు ముహూర్తం ఖరారు

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడి గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లకు 2025లో నిర్వహించు 34వ మహా జాతర మహోత్సవం నిర్వహణకు ఆదివారం శ్రీకారం చుట్టారు. రజక యూత్ అసోసియేషన్, శ్రీ ఆదిలక్ష్మి రజక సంఘం, పేరంటాల చెరువు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులతో జాతర ముహూర్తం నిర్ణయించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, చింతాడ శ్రీనివాస్, కొల్లేటి అయ్యప్పలు మీడియాతో మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా అమ్మవార్ల జాతర భక్తులు దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 19న ప్రారంభమై, 26వ తేదీన అన్నదానంతో జాతర మహోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. 19వ తేదీ గ్రామోత్సవం ప్రారంభమవుతుందని 23 గురువారం పెద్ద జాతర గునుపూడి సోమేశ్వర ఆలయం వద్ద సుమారు 500 మంది కళాకారులతో వినూత్న కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారికి పవళింపు సేవ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఆదివారం 26న అన్నదానంతో జాతర కార్యక్రమాలు ముగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నేదునూరి గంగాధర్ తిలక్, దొమ్మేటి సుబ్బయ్య, గరగపర్తి సోమేశ్వరరావు, గరగపర్తి మల్లేశ్వరరావు, అమనాపు వెంకటేశ్వరరావు, కిరణ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి జాతర మహోత్సవానికి ముహూర్తం పెడుతున్న దృశ్యం

అయ్యప్ప శరణుఘోషతో మారుమోగిన మార్టేరు


మార్టేరులో స్వామివారి ఆభరణాలను ఊరేగిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పీఠం, సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి గణపతి హోమం, కలస పూజ, పడిపూజ,అనంతరం భజన కార్యక్రమాలు ఆదివారం మార్టేరులో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కాయలగౌతమ చంద్రశేఖర్ రెడ్డి 18వ పడి శబరిమల యాత్ర చేస్తున్న సందర్భంలో చంద్రశేఖర్ రెడ్డి, నీరజా దంపతులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకృష్ణారెడ్డి, తమనంపూడి విజయ్ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీనివాసుల గోపాలచార్యులు 216 మంది కన్నె స్వాములతో గణపతి హోమం, కలస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భిక్షానంతరం స్వామి వారి ఆభరణాలతో గ్రామోత్సవం నిర్వహించి కాయల వెంకటరెడ్డి నివాసం నుంచి శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లి ఆభరణాలను స్వామివారికి అలంకరించి, అనంతరం 216 మంది కన్యాసాములతో కలశపూజ పడిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత భీమవరానికి చెందిన ఉండవల్లి బాల బ్రదర్స్ భజన కార్యక్రమం నిర్వహించి అనంతరం, పడి హారతి, ఉంజల సేవ, హరివరాసనం ఘనంగా నిర్వహించారు.

కానరాని నిత్యావసరాల ప్రత్యేక కౌంటర్

ఆకివీడు: అధిక ధరలతో సామాన్యులకు అందుబాటులో లేని నిత్యావసర సరుకులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏర్పాటు చేసిన కౌంటర్లు అడ్రస్ లేకుండా పోయాయి. మండలంలోని స్థానిక సీపీఎం రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను రెండు రోజులకే తాళం వేసి, ఈ షాపు అద్దెకు ఇవ్వబడును అనే బోర్డును పెట్టారు. ఈ కౌంటర్‌లో తక్కువ ధరకు ఉల్లిపాయలు, మంచినూనె మొదటి రెండు రోజులు సరఫరా చేశారు. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ సమక్షంలో ఏఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో వీటిని విక్రయిస్తున్నారు. అయితే ఏఎంసీ సిబ్బంది సరిపడా లేకపోవడంతో మేము కౌంటర్ వద్దకు సిబ్బందిని పంపి సరుకులను విక్రయించలేమని తేల్చి చెప్పడంతో గత్యంతరం లేక సివిల్ సప్లై అధికారులు కౌంటర్‌ను మూసివేశారు. అదే విధంగా స్థానిక మాదివాడ సెంటర్‌లో రిలయన్స్ మార్ట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ గత కొన్ని నెలలుగా పని చేయడం లేదు. తమకు ప్రభుత్వం నుంచి సరఫరా చేసే మంచినూనె, ఉల్లిపాయలు, బియ్యం, పంచదార, కందిపప్పు సరఫరా కావడం లేదని, అందుకే కౌంటర్ మూసివేశామని మార్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై సివిల్ సప్లై డీటీ మహేష్‌ను వివరణ కోరగా మార్కెట్ యార్డు సిబ్బంది కొరత వలన విక్రయాలను నిలుపుదల చేశామన్నారు. డీలర్ల వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు ఏ విధంగా చేపట్టాలో ఆలోచిస్తున్నామన్నారు. రిలయన్స్ మార్టులో అమ్మకాలు లేవన్న సంగతి తెలియదని పరిశీలిస్తానని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: జక్కరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు

ఉండి: ప్రసిద్ధ శ్రీరామక్షేత్రంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు గుండాబత్తుల సుబ్బారావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆకాశదీపం, నక్షత్ర హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కార్తీకమాసం నాలుగు ఆదివారాల్లోనూ శ్రీరామ క్షేత్రంలో కార్తీక సమారాధన ఘనంగా నిర్వహిస్తామన్నారు. పీటలపై కూర్చునే దంపతులు ముందుగా అర్చకులకు, కమిటీ వారికి తెలిజేస్తే తగు ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కళా వేదిక ప్రారంభం

భీమవరం: జిల్లాలోనే మొదటి స్థానం కలిగి సుమారు 1100 మంది విద్యార్థులకు ఉపయోగపడే కళా వేదిక నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో దివంగత చెరుకుపల్లి మురళీకృష్ణ జ్ఞాపకార్థం వారి భార్య చెరుకుపల్లి కృష్ణవేణి, కుమారుడు సంతోష్ కుమార్ సౌజన్యంతో నిర్మించబడిన కళా వేదికను ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో చెనమల్ల చంద్రశేఖర్, కోళ్ల నాగేశ్వరరావు, వారణాసి రాధాకృష్ణ, కె.విజయలక్ష్మి, వేలూరి హనుమ కిరణ్, వేలూరి సుబ్రహ్మణ్య శర్మ, చందూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

శ్రీశక్తీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో కొలువైయున్న శ్రీ పార్వతీ సమేత శక్తీశ్వరస్వామికి కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నూతన రథం నిర్మాణానికి ప్రత్యేక పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో కొలువైయున్న శ్రీ గంగా భ్రమరాంభ సమేత రామలింగేశ్వర స్వామి వారి నూతన రథ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే అంజిబాబు పూజ చేసి ప్రారంభించారు. నూతన రథ నిర్మాణానికి ప్రధాన దాతలు గాదిరాజు జానికి రామరాజు, ఝాన్సీ లక్ష్మీ దంపతులు, గాదిరాజు నారాయణరాజు, శ్రీదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.30 లక్షలతో నిర్మించే రథ నిర్మాణాన్ని శివరాత్రికి పూర్తి చేసి రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొటికలపూడి గోవిందరావు, కోళ్ల నాగేశ్వరరావు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన

ఉండి: బాలల్లో క్యాన్సర్ పట్ల అవగాహనకు చైల్డ్ క్యాన్సర్ అవేర్‌నెస్ కార్యక్రమం సోమవారం ఉదయం 10:30 గంటలకు ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు తెలిపారు. ఉండి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సాయిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా క్యాన్సర్ పట్ల అవగాహన, దాని లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పిస్తామని వారు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.